# అపస్వరం

తాటాకులు నేసిన విశాలమైన ఇల్లు. తాటాకులు చాలా పాతగా అన్నున్నాయ్ ఎండిపోయిన కంది కంచె మొహమాటంగా ఆ ఇంటిని కాపలా కాస్తూంది. కంచెపై అల్లిబిల్లిగా అల్లుకుంది. కాకరపాదు, తాటాకుల ఇంటిపైకి పాకిన బూడిద గుమ్మడి పిందెలు ముద్దు ముద్దుగా నవ్వుతున్నాయి. ఆ ఇంటి ఆవరణలో ఓవైపు పెద్దరికం సంతరించుకున్న మామిడిచెట్టు పూత పెట్టడానికి వసంతమెప్పుడు ఆదేశిస్తుందాని ఎదురు చూస్తోంది. అంతకుముందు శరత్‌వెన్నెల్లో జలకాలాడిన చామంతి వింత సోయగంతో విరాజిల్లుతూ పుష్యమి బాలభానుణ్ణి చిన్నగా వెక్కిరించింది. ఉదయపుటెండకి పూసిన మందారాల అరుణ కాంతులతో ఆ ఆవరణంతా వెలిగిపోతూంది.

అరుగు మీద మడత కుర్చీ వాల్చుకొని తెల్లని పంచె, లాల్చీ కట్టుకొని కూర్చున్నాడు సత్యం. పక్కనే ట్రాన్సిస్టర్‌లో వస్తున్న వార్తలను తదేకంగా వింటున్నాడు.

డెబ్భై సంవత్సరాల సత్యానికి పుట్టుకతో అంధత్వం లేదు. పుట్టిన నాలుగు రోజులకు మసూచి పోసి అంధత్వాన్ని శాశ్వతంగా చేసింది. సత్యం తండ్రి ఆస్తిపరుడు. అతనికి మామిడి తోటలూ, ఇళ్ళూ ఉండేవి. ఢిల్లీ చుట్టుపక్క ఊర్లలో గొప్ప ధనవంతుడిగా పేరుపొందిన అతడికి తన కొడుక్కి పెళ్లి చెయ్యటం పెద్ద కష్టం కాలేదు. సత్యానికి ఇరవై సంవత్సరాలప్పుడు పదమూడేళ్ల లక్ష్మితో వివాహం అయింది.

లక్ష్మి కుందనపు బొమ్మలా ఉండేది. పసితనంలోనే పెళ్లి అవటం వలన ఆమె మనసు చాలా త్వరగా వికసించింది. సత్యానికి ఆరుగురు అక్కచెల్లెళ్ళు, ఒక తమ్ముడు, లక్ష్మి ఆ ఇంటి పెద్ద కోడలిగా అందరి ఆలనా పాలనా చూస్తూండేది.

సత్యం బ్రతుకు తెరువు ఏమిటని ఎవ్వరూ ఏరోజూ ఆలోచించలేదు. ఆ అవసరం

కూడా రాలేదు.

సత్యానికి ఎలా కాలక్షేపం అవుతుందని మాత్రం ఆలోచించారు. అంధులకు గొప్ప కాలక్షేపం సంగీతం.

సత్యంని విజయనగరం మహారాజా మ్యూజిక్ కాలేజీలో చేర్పించారు.

వయొలిన్ నేర్చుకోవటం మొదలుపెట్టాడు సత్యం.

"నీ లీల పాడెద దేవ" - అంటూ జానకిగారి స్వరం సన్నాయితో పోటీ పడటం చూసి ఆమధ్య ఎవరో "ఎంత గొప్ప సంగీత బాణి" అని మెచ్చుకుంటే "సాలూరి రాజేశ్వర రావు సంగీతం అంటే ఏమనుకున్నారు? - మా కాలేజీలోనే చదువుకున్నారు" అనాడు సత్యం ఆనందంగా.

ఘంటసాల గారి పుష్పవిలాపం తన్మయంగా వింటూ "కాలేజీలో నా స్నేహితుడు - చూడు, ఎంత గొప్పగా పాడుతున్నాడో" అంటూ గర్వంగా ఆనాటి ముచ్చట్లు కథలు కథలుగా చెప్పటం అతని అలవాటు.

సత్యానికి ఒక కొడుకు పుట్టాడు. సత్యానికి కళ్యాణి రాగమంటే చాలా అభిమానం. కొడుక్కి కళ్యాణ్ అని పేరు పెట్టాడు. కళ్యాణ్‌కి ఊహ వచ్చేసరికి ఆరుగురు మేనత్తల పెళ్లిళ్లూ అయి, పిల్లలు నడక నేర్చే వయసుకు వచ్చారు.

"నాకు అర్జంటుగా పదివేలు కావాలి" సత్యం తమ్ముడు సారధి అడిగాడు తండ్రి బుచ్చిబాబుని.

"ఎందుకు?"

"ఎందుకు అని అడగొద్దు. ఇస్తే ఇవ్వండి, లేకపోతే లేదని చెప్పండి. నాదారి నే చూసుకుంటాను" మొండిగా అన్నాడు సారధి.

"ఏం చేస్తావ్?"

"సముద్రంలో దూకుతాను" స్పష్టంగా చెప్పాడు సారధి.

పాపమాతండ్రి ఆ బెదిరింపుకు లొంగిపోయాడు. పదివేలు సారధికి ఇచ్చాడు.

అదీ మొదటి గాలి, ఆస్తి కర్పూరంలా హరించుకు పోవడానికి.

కళ్యాణ్ డిగ్రీ పూర్తి అయింది. అతడికి అరుణతో వివాహం అయింది. స్టేట్ గవర్నమెంట్‌లో అతడికి ఉద్యోగం వచ్చిన మూడు నెలలకు తాత బుచ్చిబాబు పరమ పదించాడు.

ఎప్పుడూ పాతికమంది వ్యక్తులతో కళకళలాడే ఆ ఇల్లు వెలవెలబోయింది.

కళ్యాణ్ అరుణతో హైదరాబాద్‌లో మకాం పెట్టాడు.

ఉన్న ఊరిలో ఓ స్థలంలో ఓ పాక వేసుకొని భార్యతో ఉంటున్నాడు సత్యం. అతనికి తోడు వయొలిన్, ట్రాన్సిస్టర్, అక్కచెల్లెళ్ల రాసే ఉత్తరాలు. అందరిమధ్య ఆప్యాయతలకేం కొదవలేదు. కాని రాకపోకలే తగ్గాయి. చాలాకాలం క్రితం సారధి ఓ యాక్సిడెంట్‌లో పోయాడు.

ఈ సంక్రాంతి సందుగకు కళ్యాణ్ వస్తానని రాశాడు. కొడుకు కోసం కళ్లింత చేసుకొని ఎదురు చూస్తూంది లక్ష్మి.

"అబ్బాయ్ రావటానికింకా టైమ్ ఉందాండి?" అడిగిందామె.

"చాలా ఉంది. ఏదీ ఇంకా ఎనిమిదే కాలేదు. ట్రైన్ ఇంకా విశాఖే వచ్చుండదు" అన్నాడు సత్యం.

"కోడలు, పిల్లలూ కూడా వస్తే బాగుంటుంది కదండి" అంది లక్ష్మి.

"అబ్బాయి నాకోసం ఓ కొత్త ట్రాన్సిస్టర్ తెస్తే బాగుండును. ఇది పాతదై గరగర లాడుతూంది" అన్నాడు సత్యం.

"మీకెప్పుడూ ఆ రేడియో గొడవే. నాకేమో పిల్లలతో కొన్నాళ్లు గడపాలని ఉంది" అంది లక్ష్మి.

"అబ్బాయి మనల్ని అక్కడికి వచ్చేయమని రాస్తూనే ఉన్నాడు. ఈ ఊరిపై, ఈ ఇంటిపై మమకారం మనల్ని ఇక్కడనుండి కదలనివ్వటం లేదు. కాని ఇక్కడ మనమేం ఆనందంగా ఉన్నాం చెప్పు. ఏ గాలికి రాలిపోతుందో తెలియదా కంచె, ఏ వర్షానికి కూలిపోతాయో ఈ ఇంటి గోడలు. ఏ నిప్పులు చెరిగే ఎండకి అంటుకుపోతుందో ఆ కప్పు. నీకు - నాకు రోగం వస్తే గుక్కెడు నీళ్లు పోసే దక్షతా లేదు. ఈసారి అబ్బాయి పిలిస్తే వెళ్లిపోదాం, ఏమంటావ్?" అడిగాడు సత్యం.

"వెళ్లిపోదామండి. ఇక్కడ మనకెవరున్నారు? నా అనే నలుగురు మధ్యే ఉందామండి" అంది లక్ష్మి.

★ ★ ★

"నాతో వచ్చేయండమ్మా, ఎందుకిక్కడ ఒంటరిగా" అన్నాడు కళ్యాణ్.

"అలాగే వచ్చేస్తాం కాని ఈ ఇల్లు" అన్నాడు సత్యం.

"అమ్మేద్దాం. మీకిష్టం లేకపోతే ఎవరికైనా అద్దెకి ఇద్దాం" అన్నాడు కళ్యాణ్.

"దీనికి అద్దె ఎవరిస్తార్రా, అమ్మేద్దాం" అన్నాడు సత్యం.

ఇంటికి బేరం పెట్టారు.

షావుకారు కొన్నాడు.

సత్యం ఆఖరిసారిగా ఆ ఇల్లంతా తడిమి తడిమి చూస్తూ తిరిగాడు.

లక్ష్మి తనివిదీరా ఆ ఊరి పొలిమేరల్ని చూస్తూంది.

"పొలిమేర దాటిపోతున్నాం ఓ గువ్వల చెన్నా
పొరుగూరు చేరిపోతున్నాం ఓ గువ్వల చెన్నా"

- ఎక్కడో విన్న పాట ఆమె మదిలో కదిలింది.

"గుళ్లో నిన్ను చూడలేకున్నా ఓ గువ్వలచెన్నా
గుండెల్లో దాచుకున్నాలే ఓ గువ్వలచెన్నా
ఏ సీమలు తిరుగాడినా ఓ గువ్వలచెన్నా

నీ దీవెన లందించాలన్నా ఓ గువ్వలచెన్నా"

– సత్యం మనసులో మెదిలిందా పాట.

★ ★ ★

"బాగున్నారా అత్తయ్యా" ఆప్యాయంగా పలకరించింది అరుణ.

"తాతాజీ నా క్రాఫ్ చూడండి" అంటూ తన బాబ్డ్ హేర్‌పై సత్యం చేతిని పెట్టి చూపించింది పద్నాలుగేళ్ల రేఖ.

"భేషుగ్గా ఉందమ్మాయ్" అన్నాడు సత్యం.

"తాతాజీ నే గిటార్ వాయించటం నేర్చుకుంటున్నాను. వయొలిన్ నేర్పిస్తారా?" అడిగాడు పదహారేళ్ల కార్తీక్.

"కాళ్ల నొప్పులు. నేనిప్పుడు వయొలిన్ వాయించలేను" అన్నాడు సత్యం.

కోడలు, పిల్లలు చూపించే ఆదరాభిమానాల మధ్య లక్ష్మి, సత్యంకి వారం రోజులు క్షణాల్లా గడిచిపోయాయి.

ఓ మారుమూల ఊరిలో జీవితమంతా గడిపి, ఆఖరి కాలంలో నగర జీవనంలోకి అడుగు పెట్టిన లక్ష్మి, సత్యంలకి ఆ ఇంట్లోవారి జీవనసరళి చాలా వింతగా తోచింది.

అరుణ ఓ లిమిటెడ్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తోంది. ఉదయం తొమ్మిది గంటల నుండి ఆరు గంటల వరకు ఆఫీసు వేళ. ఇంటికి ఆఫీసు చాలా దూరం. ఆమె ఉదయం ఎనిమిది గంటలకి బయలుదేరితే సాయంత్రం ఏడున్నరకే ఇంటికి చేరుతుంది. కళ్యాణ్ తొమ్మిదికి బయలుదేరి సాయంత్రం ఆరున్నరకి వస్తాడు. రేఖ ఉదయం ఎనిమిది గంటలకి ఇల్లు వదిలి రాత్రి ఎనిమిది గంటలకే ఇంటికి చేరుకుంటుంది. ఆ మధ్య కాలంలోనే చదువు, ట్యూషన్, టైప్, డాన్స్ క్లాసులకి వెళుతుందామె.

కార్తీక్ మధ్యాహ్నం కాలేజీకి వెళతాడు. సాయంత్రం ఏడు గంటలకి వస్తాడు. ఉదయమంతా అతడు చదువుకుంటుంటాడు. వివేక్ సి.ఏ. ఆర్టికల్స్ చేస్తున్నాడు. అతడికి పుస్తకాలే లోకం. ఉదయం పది గంటలకి ఇంట్లోనుండి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకి వస్తాడు.

వంటిల్లు కాకుండా రెండు గదులున్న ఇల్లు అది. పక్కనే మరో పోర్షన్. ఇంటిగల వాళ్లుంటారు.

టూ-ఇన్-వన్, టి.వి., పేరుకి మాత్రమే ఉన్నాయి. వాటిని వాళ్ల ఏరోజూ ఆన్ చెయ్యరు.

అరుణ ఖాళీగా ఉన్నప్పుడే వంటచేసి ఫ్రిజ్‌లో ఉంచి వడ్డించేముందు వేడి చేస్తుంది. ఏరోజూ అందరూ కలిసి భోజనం చెయ్యరు. వాళ్లకి కుదర్దు.

లక్ష్మి కోడలికి ఇంటి పనుల్లో సాయం చెయ్యటం మొదలు పెట్టింది. అరుణ అభ్యంతరం చెప్పినా "నాకెలా పొద్దుపోతుంది" అంటూ కల్పించుకొని చేస్తుండేది.

★ ★ ★

ఉదయం అయిదు గంటలు.

బాత్రూమ్ దగ్గర నీళ్ల చప్పుడవుతుంటే కార్తీక్ నిద్రలో అటునుండి ఇటు కదిలి "ఎవరా చప్పుడు" అన్నాడు విసుగ్గా.

"నేనే" అన్నాడు సత్యం.

అయిదు గంటలకే దంతధావనం చేయటం సత్యానికి బాల్యం నుంచి అలవాటు.

"ఏం తొందరొచ్చిందండి. ఓ గంట ఆలస్యంగా లేస్తే మీకేమైంది - పడుకో నివ్వకుండా" మరింత మునగదీసుకొని పడుకుంటూ అన్నాడు కార్తీక్.

"వీళ్లకోసం నా అలవాటు మార్చుకోవాలి" అనుకున్నాడు సత్యం.

"అమ్మా!" పిలిచాడు వివేక్.

ఆఫీసుకి రెడీ అవుతున్న అరుణ "ఏం?" అంది.

"తాతాజీని రేడియో చిన్నగా పెట్టుకోమని చెప్పు. చదివేది ఏదీ తలకెక్కట్లేదు" అన్నాడు.

"నువ్వే చెప్పు".

"ఉహూ, నే చెప్పను. నువ్వయితే ఆయన నొచ్చుకోకుండా చెప్పగలవ్" అన్నాడు వివేక్.

"సమయం చూసి చెపుతాలే" అంది అరుణ.

★ ★ ★

రాత్రి పది గంటలు.

కార్తీక్, రేఖ, వివేక్ చదువుకుంటున్నారు. అదే గదిలో లక్ష్మి ఓమూల మంచంపై నిద్రపోతూంది. ట్యూబ్‌లైట్ కాంతి ఆమె నిద్రని చెదరకొట్టట్లేదు. మరో గదిలో అరుణ మత్తుగా నిద్రపోతూంది. కళ్యాణ్ పేపర్ చదువుతున్నాడు. పిల్లలు చదువుతున్న గదిలోనే సత్యం మడత కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆయన ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. రేడియోలో సంగీత కచేరి మొదలయింది. కచేరి మొదలైన క్షణాల్లో అతని మనసునిండా ఉద్వేగం నిండుకుంటుంది. రాగం మెల్లమెల్లగా మొదలవ్వగానే ఉద్వేగం ఆనందాన్ని సంతరించుకుంటుంది. రాను రాను అతని హృదయం ఆ కచేరీలో లీనమై పోతుంది. ఆ క్షణంలో అతడికి తన అంధత్వం, బంధుమిత్రులు, హరించుకుపోయిన ఆస్తి, భార్య, కార్తీక్ అదలింపూ ఏం గుర్తురావ్. అణువణువూ సంగీత ఝరి అలలలుగా కదుల్తుంటుంది. ఆకాశవాణి ధ్వని తరంగాలని అంధులు ఆస్వాదించినంత గొప్పగా ప్రపంచంలో ఏ ప్రాణీ ఆస్వాదించదు. అందులో ఆనంద విషాదాలు వారి మనసులకి తట్టినంత దివ్యంగా మరే హృదయానికీ తట్టవ్.

"కట్టెయ్యండి ఆ రేడియోని" విసుగ్గా అంది రేఖ.

"వెధవగోల. ఎప్పుడు చూసినా ఆన్‌చేసి ఉంటుంది. అసలు చదువుకోవటమే కుదరట్లేదు" కోపంగా అన్నాడు కార్తీక్.

"ఆ రేడియో బయట విసిరేస్తే కాని ఈ గోల విరగడవ్వదు" అన్నాడు వివేక్..

ఇవన్నీ అందరికీ వినిపిస్తున్నాయి.

"మరో గది ఉన్న ఇల్లు తీసుకుంటే..." అనుకున్నాడు కళ్యాణ్.

"అద్దె భరించటం కష్టం" అంది అరుణ. ఈ గొడవకి ఆమె నిద్ర పారిపోయింది.

"తిరిగి ఆ ఊరే వెళ్లిపోతే?" అనుకుంది లక్ష్మి.

'కాని అక్కడేం ఉంది? ఎలా బ్రతుకుతారు? ఇక్కడేం తక్కువయిందని. చిన్ని ఇల్లు. మనుషులు ఎక్కువ. యంత్రాల రొదలో నిశ్శబ్దమే కరువైపోయిన జీవితంతో కావాలని తెచ్చుకున్న మరో ధ్వని రేడియో. అది లేకపోతే కాస్త నిశ్శబ్దం' తిరిగి ఆమె అనుకుంది.

"రేడియో కట్టెయ్యండి. పిల్లలు చదువుకుంటున్నారు" అంది లక్ష్మి.

సత్యానికి రేఖ రేడియో కట్టేయమన్నప్పుడే కోపం వచ్చింది. లక్ష్మి కట్టేయమనగానే కోపం గుండెల్లో బాధగా ఘనీభవించింది. అసహాయంగా రేడియో కట్టి మంచంపై నడుం వాల్చాడు సత్యం.

ఇలా ఒకటి ... రెండు ... మూడు ... నాలుగు రోజులు కాదు. చాలా రోజులు గడిచాయ్. రేడియో పెట్టకుండా ఉండలేని బలహీనత సత్యంది. ఆ శబ్దాన్ని ఏమాత్రం భరించలేని పరిస్థితి ఇంట్లో సభ్యులది.

రేడియో పెట్టిన ప్రతిసారీ అనుభవిస్తున్నదే బాధ. అయినా ప్రతిసారి చాలా దుర్భరంగా తోస్తుంది. గుండెని నిప్పుల్లో పెట్టినట్టు శరీరమంతా బాధతో కణకణ మండిపోతుంటుంది. కాని మాట అధరాలపై రాదు.

ఆ రేడియోలో సత్యం పొందే ఆనందం, తృప్తి ఏమిటో ఆ ఇంట్లో సభ్యులకు అర్థం కాదు. చాలా విషయాలు అనుభవం వలన అవగతమవుతాయి.

లక్ష్మికి రేడియోతో అతడి అనుబంధం ఏమిటో కాస్త తెలిసినా మిగిలిన వారికి వివరించే జ్ఞానం, ధైర్యం లేవు. తనవాళ్లందరి మధ్య నిశ్చింతగా బ్రతికే మహద్భాగ్యాన్ని రేడియో గురించి వదులుకోవాలని ఆమెకి లేదు. అందుకే భర్త రేడియో పెట్టిన ప్రతిసారీ కట్టేయమంటుంది.

సత్యం కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయ్. అతని బాధతో ఎవరికి సంబంధం? రేడియోకి, అతని హృదయానికి ఉన్న అనుబంధం ఎంత అపురూపమైనదైనా ఎవరికి కావాలి? తన కోపాన్ని, బాధని ఎవరిపై చూపించగలడు? రోజూ అనుభవించే బాధే కాని ఎప్పటికప్పుడు కొత్తగా అదే తొలిబాధ అన్నట్టు అతడి హృదయంపై విషాదం దట్టంగా కదుల్తుంది. చూపు కరువైన బ్రతుక్కి కాస్త తోడు, ఓదార్పు ధ్వని - రేడియోనుంచి వెలువడే ఆ సంగీత స్వరాన్ని వినలేని వ్యథ ఏ హృదయానికి అర్థం అవుతుంది?

సత్యం చేతులు అప్రయత్నంగా రేడియోని ఆన్ చేశాయి.

"రేడియో కట్టెయ్యండి. వాళ్లు ఏమైనా అంటారు. అర్థం చేసుకోరేం?" విసుగ్గా

అంది లక్ష్మి.

రేడియోతో అనుబంధాన్ని అర్థం చేసుకోని భార్యపై కోపం వచ్చింది సత్యానికి. ఏం చెయ్యగలడు? అనుబంధం కలిగించిన బాధ ఎవరిపై చూపించగలడు? చూపిస్తే ఎవరూరు కుంటారు. ఆ అనుబంధం తప్పా?

ఎన్నో సంవత్సరాలు అపురూపంగా ఏ వస్తువునైతే స్పృశించాయో ఆ చేతులే నిస్సహాయంగా ఆ వస్తువుని నేలకేసి కొట్టాయి. చిన్నాభిన్నమైన రేడియోని చూసి అంతా "అరే" అంటూ సానుభూతి ప్రకటించారు. సత్యం హృదయ శకలాలని ఎవరు చూస్తారు? ఎవరు చూడగలరు? ఆ రేడియో తప్పు!

• *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 21, జూన్ 1989* •